జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 19-9-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 459 పేజీలు: 4 వెల : రూ.7

# డ్వాక్రా సొమ్ములు.. స్వాహా

* రూ.7లక్షలు మింగేసిన జనసేన నాయకుని భార్య * పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసిన గ్రూప్ సభ్యులు * జనసేన పార్టీలో చర్చనీయాంశం * జనసేన అధినేత దృష్టికి తీసుకువెళ్లనున్న సభ్యులు, జనసైనికులు



**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 18 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 17వ వార్డు కి చెందిన భువనేశ్వరి స్వయం సహాయక సంఘం సభ్యులు గ్రూప్ లీడర్ కర్రి కృష్ణవేణిపై పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కృష్ణవేణి భర్త కర్రి నాగరాజు 17వ వార్డు జనసేన నాయకుడుగా ఉన్నారు. డ్వాక్రా గ్రూపు మొత్తం 15 లక్షలు రూపాయల రుణాన్ని గత ఏడాది జనవరిలో తీసుకున్నారు. అప్పటినుండి గ్రూప్ సభ్యులందరూ బ్యాంకుకు చెల్లించవలసిన రుణాన్ని ఆమెకు చెల్లిస్తున్నారు. కృష్ణవేణి తొమ్మిది నెలల పాటు బ్యాంకుకు లోను సొమ్ము కట్టలేదు. గ్రూప్ సభ్యులు బ్యాంకులో చేసుకున్న పొదుపు సొమ్ము 2,74,500 రూపాయలు కూడా బ్యాంకు నుండి విత్ డ్రా చేసేసింది. అక్కడికి 9 నెలలు అనంతరం ఈ విషయం తెలుసుకున్న గ్రూప్ సభ్యులు గ్రూపు లీడర్‌ని వాళ్ళు పొదుపు సొమ్ము, బ్యాంకు కట్టాల్సిన లోను మొత్తం 7,11,660 రూపాయలు వెంటనే చెల్లించాలని కోరారు. లేకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. దీంతో లీడర్ భర్త అయిన నాగరాజు తన భార్య పడ్డ బాకీ మొత్తం చెల్లిస్తానని పోలీస్ స్టేషన్లో పోలీసుల ముందు ఈ ఏడాది జూలైలో ఒప్పుకున్నట్టు సభ్యులు చెప్పారు. ఆగస్టు 25 నాటికి బ్యాంకు కట్టాల్సిన అప్పు మొత్తం తీరుస్తానని అంగీకరించాడు. అయినప్పటికీ ఆ లోన్, పొదుపు సొమ్ము పైసా కూడా తీర్చలేదు.. ఇదే విషయం అతన్ని అడిగితేనే నేను బ్యాంకుకు కట్టాల్సిన అప్పును కట్టనని మీకు దిక్కున చోటు చెప్పుకోండి అని అనడంతో ఏం చేయాలో పాలుపోక బాధితులు అందరూ పోలీస్ స్టేషన్‌లో పట్టణ ఎస్ఐ ముకుంద రావు దగ్గర మొరపెట్టుకున్నారు. బాధితులు అయిన గ్రూప్ సభ్యులు మహాలక్ష్మి, దుర్గాదేవి, నీలవేణి, జాజుల దుర్గ, లక్ష్మమ్మ, షేక్ ఫాతిమా, బి.సీతమ్మ, దుర్గమ్మలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారులు ఉందని, నన్నెవరూ ఏం చేయాలేరని కృష్ణవేణితో పాటు అతని భర్త అంటున్నారన్నారు. కాగా ఈవిషయాన్ని జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్లేందుకు సంసిద్ధమవుతున్నారు.

## విద్యార్థినికి నైట్ వాచ్‌మేన్ వేధింపులు

* తననే ప్రేమించాలంటూ బలవంతం * తరగతి గదిలోకి రమ్మని తాళం వేసిన వైనం * రెంటికోట జడ్పీ హైస్కూల్ లో ఘటన * ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన * గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసిన హెచ్ఎం * కీచకుడిపై చర్యలకు గ్రామస్థుల డిమాండ్

**పలాస, సెప్టెంబర్18(వార్త):** పలాస మండలంలోని రెంటికోట జడ్పీ ఉన్నత పాఠశాలలో నైట్ వాచ్ మెన్ అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై వేధింపులకు గురిచేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. విద్యార్థిని ప్రేమిస్తున్నానని ఎవరూ ఆమె జోలికి వెళ్లవద్దని తోటి విద్యార్థులకు నైట్‌వాచ్‌మెన్ బెదిరించేవాడు. ఐదు రోజుల కిందట ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో విద్యార్థిని పాఠశాలకు వెళ్లింది. ఉపాధ్యాయులు రమ్మని చెప్పారని చెప్పి ఆమెను ఓ గదిలోకి తీసుకువెళ్లి తలుపు వేశాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో తలుపులు తీసి బయటకు పంపించివేశాడు. ఈ విషయాన్ని ఆమె ఇంట్లో కుటుంబీకులకు తెలియజేసింది. వారు హెచ్ఎంను కలిసి విషయాన్ని వివరించారు. హెచ్ఎం గ్రామస్థులతో సమావేశం పెట్టారు. ఈ నేపథ్యంలో నైట్ వాచ్‌మెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈవిషయమై హెచ్ఎంను సంప్రదించగా మూడు రోజుల కిందటే తనకు ఈ విషయం తెలిసిందని తెలిపారు. వెంటనే వాచ్‌మెన్‌ను ఉద్యోగం నుంచి తప్పించామన్నారు.

## పోలీస్ స్టేషన్ ఎదుటే.. వివాహిత..
# ఆత్మహత్యాయత్నం

* అత్తింటి వేధింపులు తాళలేకే అంటున్న కుటుంబీకులు * రిమ్స్‌లో చికిత్స

**పలాస, సెప్టెంబర్ 18(వార్త):** అత్తింటి వేధింపులు తాళలేక కాశీబుగ్గ పోలీసే స్టేషన్ ఎదుటే పలాస మండలం గొల్ల మాకన్నపల్లి గ్రామానికి చెందిన వివాహిత రాపాక రూపవతి గురువారం సాయంత్రం పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రూపవతికి మందస మండలం లింబుగాం గ్రామానికి చెందిన భానుతేజతో రెండున్నరేళ్ల కిందట వివాహమైంది. వీరికి బాబు పుట్టాక భార్యభర్తల మధ్య గొడవలు ఏర్పడడంతో కాశీబుగ్గ పోలీస్ స్టేషన్లో నెలరోజులు క్రితం ఫిర్యాదు చేశారు. దీనితో కాశీబుగ్గ పోలీసులు భార్యభర్తలకు పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, రాజీ చేసి పంపించారు. అయినప్పటికీ భర్త అత్తమామలు వేధింపులు మరింత పెరగడంతో రూపవతి తీవ్ర మనస్థాపానికి గురైంది. గురువారం రూపవతి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని భర్తతో పాటు తన అత్తామామలు ఏకమై తనను వేధించి, దాడి చేశారని మరో మారు ఫిర్యాదు చేసింది. కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ.. రూపవతి భర్త భానుతేజతో ఫోన్లో మాట్లాడారు. వివాదం పరిష్కరించుకుంటావా, కేసు కట్టాలని అని ప్రశ్నించగా కేసు కట్టుకోండని చెప్పాడు. ఇదే విషయాన్ని సీఐ.. రూపవతికి తెలియజేశారు. దీంతో మనస్థాపానికి గురైన రూపవతి కుమారుడిని స్టేషన్ వద్ద ఉంచి బిస్కట్ కొని తెస్తానని చెప్పి, బజారుకు వెళ్లి పురుగులు మందు కొనుక్కొని వచ్చింది. ఆ తర్వాత పోలీస్‌స్టేషన్ ఎదుట తాగి స్పృహతప్పి పడిపోయింది. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే స్పందించి పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమెను చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబీకులు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆ తర్వాత శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్‌కి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు రూపవతి అత్త మామలు, భర్తపై 408 సెక్షన్ తో కూడిన కేసు నమోదు చేయడం జరిగిందని కాశీబుగ్గ సీఐ తెలిపారు.



## ఎంపీ ల్యాడ్ నిధులతో..
# గ్రామాభివృద్ధి

* జాతీయ రహదారుల్లో బ్లాక్ స్పాట్స్‌ను తగ్గిస్తాం * జల జీవన్ మిషన్, ఎంపీ లాడ్స్, నేషనల్ హైవేస్‌పై కేంద్ర మంత్రి రామ్మోహన్ సమీక్ష

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 18(వార్త):** శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఎంపీ లాడ్స్, నేషనల్ హైవేస్, జల జీవన్ మిషన్‌పై కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మో హన్ నాయుడు గురువారం సమీక్షా సమా వేశాన్ని నిర్వహించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి క్షేత్ర స్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా మాట్లా డిన రామ్మోహన్ నాయుడు.. సమీక్షలో కీలక అంశాలను మీడియాకు వివరించారు. పార్లమెంట్ సభ్యుని లోకల్ ఏరియా డెవల ప్మెంట్ నిధులకు ఒక ప్రత్యేకత తీసుకొచ్చిన ఘనత కింజరాపు ఎర్రన్నాయుడుది అని గుర్తు చేసిన రామ్మోహన్ నాయుడు.. జిల్లా నలు మూలలకు ఎన్నో కార్యక్రమాల ద్వారా ఆయన చేరువ అయ్యారన్నారు. ఈ పదేళ్లలో అదే స్ఫూర్తితో అనేక కార్యక్రమాలను నిర్వహించా మని, ప్రభుత్వం నిర్వహించలేని వాటిని ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా సాధ్యం చేసుకుంటున్నా మన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బస్ కాం ప్లెక్స్, ఎలక్ట్రికల్ లైన్లు, సోలార్ లైన్లు ఇతర ప్రాజెక్టులను స్థానిక ఎమ్మెల్యేల డైరక్షన్‌లో ఎంపీ లాడ్స్ ద్వారా చేసుకుంటూ వచ్చామని తెలిపారు. ఏ సంవత్సరం ప్రారంభించిన కార్యక్రమం.. అదే సంవత్సరం ముగించాలి అనే విధానంలో ఎంపీ లాడ్స్ నిధులను ఖర్చు చేస్తున్నా మన్నారు. జాతీయ రహదారుల వృద్ధికి కూడా అప్పట్లో ఎర్రన్నాయుడు గోల్డెన్ ప్రాజెక్ట్‌గా రెండు లైన్ల రహదారి నాలుగు లైన్లకు మార్చారని, తాను ఆరు లైన్ల రహదారి సాధన కోసం ఇప్పటికే పలు దఫాలుగా కేంద్ర మంత్రి త్వ శాఖకు పరిస్థితులు వివరించామన్నారు. కోస్టల్ కారిడార్ ద్వారా తీరానికి ఆనుకొని మరో ఆరు లైన్ల జాతీయ రహదారి వస్తోందని స్పష్టం చేశారు. లాజిస్టిక్ కనెక్టివిటీ వల్ల ఎకనామిక్ గ్రోత్ ఉంటుందని చెప్పారు. భోగాపురం వచ్చే సంవత్సరం జూన్ నాటికి పూర్తి చేస్తామని.. దానికి అనుసంధానం అయ్యే జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుం దన్నారు. శ్రీకాకుళం జిల్లా పరిధిలో 180 కిలోమీటర్లకు పైగా ఉన్న జాతీయ రహ దారిలో అనేక బ్లాక్ స్పాట్‌లను గుర్తించామ తెలిపారు. మూలపేట పోర్ట్ ప్రారంభం తర్వాత.. హైవేపై మరింత ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉందని.. అందుకు తగ్గట్టుగా జాతీయ రహదారి విస్తరణ కూడా త్వరలో జరుగు తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జల జీవన్ పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంటే.. శ్రీకాకుళం పరిస్థితి మరింత దారుణంగా ఉందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## 22న డ్రోన్ పైలెట్ ఉద్యోగాలకు ఎంపికలు

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 18 (వార్త):** శ్రీకాకుళం పట్టణంలోని అభ్యుదయ డిగ్రీ కాలేజ్‌లో డ్రాగ్ డ్రోన్స్ ప్రైవేట్ కంపెనీకి సంబంధించి డ్రోన్ పైలెట్ ఉద్యోగాల కోసం ఈ నెల 22న ఎంపిక ప్రక్రియ జరుగుతుం దని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. 10వ తరగతి లేదా అంతకంటే పై చదువు పూర్తి చేసిన 18 నుండి 28 ఏళ్ల మధ్య వయస్సు గల పురుషులు అర్హులన్నారు. మూడు నెలలపాటు శిక్షణ ఉంటుందని, ఈ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలతో పాటు నెలకు రూ.5 వేల స్టైపెండ్ అందజేస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం నెలకు రూ.22 వేల జీతంతోపాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ రెజ్యూమ్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో అభ్యుదయ డిగ్రీ కాలేజ్‌లో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95509 67353 నంబరును సంప్రదించాలన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నేడు డయల్ యువర్ డీఎం



**పలాస, సెప్టెంబరు 18(వార్త):** పలాస ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎంఎస్ఎస్ నాయుడు తెలిపారు. పలాస ఆర్టీసీ డిపోలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీకి సంబంధించి ఏ సమస్య ఉన్నా ఫోన్ నెంబర్ 9959225610కు సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మందసలో నేడు మాజీ మంత్రి శివాజీ పర్యటన

**మందస, సెప్టెంబరు 18(వార్త):** మాజీ మంత్రి, పలాస మాజీ శాసనసభ్యుడు గౌతు శ్యామసుందర శివాజీ ఈ నెల 19న మందస మండలంలో పర్యటిస్తారని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం 9.30గంటలకు హంసరాలి పంచాయతీ చిక్కిడిగాం గ్రామం, 10.30గంటలకు బుడార్శింగి పంచాయతీ కురదాలు, 11.30గంటలకు దున్నూరు పంచాయతీ మొగలిపాడు గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. ఇటీవల మరణించిన మృతుల కుటుంబాలను పరామర్శిస్తారన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పాల్గొంటారన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వండి

**-మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను**

**కోరిన ఎమ్మెల్యే శిరీష**

**-మౌలిక వసతులు, బీటీ రోడ్ల కనెక్టివిటీకి**

**రూ. 10 కోట్లకు ప్రతిపాదనలు**



**పలాస, సెప్టెంబరు 18(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో గురువారం ఆమె భేటీ అయ్యారు. మున్సిపాలిటీలో మౌలిక వసతులు, నెహ్రూ పార్క్ బ్యూటీఫికేషన్, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, బీటీ రోడ్లకు కనెక్టివిటీ తదితర అంశాలను ప్రస్తావించారు. రూ.10 కోట్లు మంజూరు చేయాలని విన్నవించారు. ప్రతిపాదన లను ఆయనకు అందజేశారు. జంట పట్టణాల్లో తాగునీటి సమస్యను పరిష్క రించాలని కోరారు. ఈ అంశాలపై ఆయన సానుకూలంగా స్పందించారు.

# ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి




**పలాస, సెప్టెంబరు 18(వార్త):** కాశీబుగ్గ ఎంపీడీవో కార్యాలయంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ వారు పలాస మండల పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్స్‌తో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీఎన్జీజీవోస్ అధ్యక్షులు పలాస బోనెల గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ కమిషన్ వేయాలని, బకాయి డీఏలు తక్షణమే చెల్లించాలని, సరెండర్ లీవ్ బకాయిలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, ఏపీ ఎన్జీవోస్ సెక్రటరీ బి.ఉపేందర్‌రావు, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, ఎల్ శ్రీనివాస రావు, అసోసియేషన్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్, పంచాయతీ సెక్రటరీలు సుధాకర్, సద్గుణరావు, ఖగేశ్వరరావు, మీనాకుమారి, శ్రీదేవి, ఆశ, రవి రాజకుమార్, డిజిటల్ అసిస్టెంట్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలాస ఎంఈవోలు శ్రీని వాసరావు, సత్యం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగాల్ని కలిసి సభ్యత్వ నమో దును, ఎన్జీవో సమాచారాన్ని నమోదు చేశారు.

# దళితులకు వైకాపా హయాంలోనే న్యాయం

**-కోటబొమ్మాళి ఎస్సీ సెల్ అధ్యక్షుడు**

**కాళ్ల గణపతి రావు.** .



**కోటబొమ్మాళి, సెప్టెంబరు 18(వార్త):** దళిత సామాజిక వర్గాలకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హయాంలోనే న్యాయం జరిగిందని వైసీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాళ్ల గణపతిరావు అన్నారు. గురువారం శ్రీకాకుళంలో నిర్వ హించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం విస్తృతస్థాయి సమావేశానికి వచ్చిన రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీ.జె. సుధాకర్‌బాబును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఎస్సీ కల్చరల్ విభాగ అధ్యక్షుడు పొన్నాడ మురళీమోహన్, కోటబొమ్మాళి సర్పంచ్ కాళ్ల సంజీవరావు, కురుడు సర్పంచ్ కోతి చెన్నారావు, ఎంపీటీసీ చుక్క లోకేష్, పంకు రాము, బోనెల ఎల్లయ్య, దండాసి సింహాచలం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల పనితీరును పరిశీలించిన డైట్ లెక్చరర్



**మందస, సెప్టెంబరు 18(వార్త):** మకరజోల, సొండిపూడి ప్రాథమిక, కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను వమరవల్లి డైట్ ఇంగ్లీష్ అధ్యాపకుడు జి.ఇందు వదన పరిశీలించారు. పరిసరాల పరిశు భ్రత, ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు, టీచర్ హ్యాండ్ బుక్స్, విద్యార్థుల సామర్థ్యాలు, అసెస్మెంట్ పుస్తకాలు, ప్రాజెక్టలు, మధ్యాహ్నం భోజనం తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి, ఉపాధ్యా యులు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని విద్యార్థులు, వారి తల్లిదం డ్రులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట కొత్తపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వేణుగోపాలరావు, సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.



## పలు గ్రామాల్లో సేవా పక్షోత్సవాలు

**జి.సిగడాం, సెప్టెంబరు 18(వార్త):** ఆనందపురం, ఆబోతుల పేట, ధవళపేట, వాంగ్రంగి గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో గురువారం సేవా పక్షోత్సవాలు నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు కలిసి గ్రామాల్లో బైక్ ర్యాలీ చేపట్టారు. ధవళపేటంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు సన్మా నం చేశారు. కార్యక్రమంలో నియోజకర్గ కో కన్వీనర్ సంపతిరావు నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు బురాడ వెంకటరమణ, జిల్లా కార్యదర్శి వర్జపర్తి రఘురాం, సర్పంచ్ సాకేటి నాగరాజు, ముద్దాడ గౌరీశ్వరరావు, బోట్ల భాస్కరరావు, మీసాల రామకృష్ణ, బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్, వెన్ని జనార్ధనరావు, అపన్న, త్రినాథరావు, డి.రామకృష్ణ, త్రినాథ, ఎస్.శంకరావు తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణతర్ల రోడ్డులో జంగిల్ క్లియరెన్స్



**పలాస, సెప్టెంబరు 18(వార్త):** బ్రాహ్మణతర్ల రోడ్డుకు ఇరువైపులా ఉన్న దట్టమైన పిచ్చి మొక్కలను గురువారం తొలగించారు. కార్యక్రమంలో కృష్ణంరాజు శ్రీసయిన సాధికారిక కమిటీ మెంబర్, యూనిట్ కన్వీనర్, ఎదల నాయకరావు, సీతారాం, మౌళి, తులసీరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురం చేరుకున్న పాఠ్య పుస్తకాలు




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18(వార్త):** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాలు మండల విద్యాశాఖ కార్యాలయానికి చేరుకున్నాయి. 35 వేల పుస్తకాలు రావాల్సి ఉండగా మొదటి విడతలో 17064 వచ్చాయి. వీటిని కార్యాలయంలో ఉంచారు. వీటిని పాఠశాలలకు పంపిణీ చేస్తామని ఎంఈవోలు అప్పారావు, విశ్వనాథం తెలిపారు.

## కొత్తమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్‌గా చిన గోవింద్



**కోటబొమ్మాళి, సెప్టెంబరు 18(వార్త):** కొత్తమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్‌గా కోరాడ చిన గోవింద్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ అధికా రులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సభ్యులుగా ఎస్.గణపతిరావు, బి.ప్రసాద్ రావు, డి.నాగరాజు, కె.అప్పలరాజు, ఎం.వెంకటరావు, పి.ఇందువదన, పి.కౌశల్య, ఎ.యశోద, సీహెచ్.శోభారాణి, డి.కళ్యాణిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఆలయ కార్యనిర్వాహణాధికారి రాధాకృష్ణ తెలిపారు.

## విద్యార్థినికి ఆర్థిక సాయం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18(వార్త):** జేసీఐ వీక్ గ్రాండ్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా కృతజ్ఞతా, వేడుకల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు, తల్లిదండ్రులు, ప్రేరణనిచ్చిన వ్యక్తులకు కృతజ్ఞతా పత్రాలు అందజేశారు. కవిటి ఎస్‌విజెలో చదువుతున్న పేద ప్రతిభావంతురాలు 8వ తరగతి విద్యార్థిని సోనియాకు రూ.23,000లు, స్కూల్ బ్యాగ్ అందజేశారు. కార్యక్రమంలో జేసీఐ ఇచ్ఛాపురం అధ్యక్షుడు కాళ్ల జైదేవ్, జేసీఐ వీక్ చైర్మన్ వెచ్చా వాసవి, జోన్ ఆఫీసర్లు టి.షణ్ముఖ్, ఎం.స్వరూప్, పవన్, డా.మట్టా శ్రీనివాస్, శిరీష, శ్రావ్య, రేణుకా, సంతోష్ సాహు, ప్రేమ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

**కోటబొమ్మాళి, సెప్టెంబరు 18(వార్త):** పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరని స్థానిక పశు సంవర్ధక సహాయ సంచాలకులు మందా లోకనాథం అన్నారు. కోటబొమ్మాళి, ఎత్తురాళ్లపాడు, రాయిపాడు, సుబ్బారావుపేట, బావాజీపేట, యరకయ్యపేట తదితర గ్రామాలో గల 471 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను గురువారం పశువైద్యాధికారులు డాక్టర్ ఎల్.కిరణ్‌కు మార్, ఎం.ప్రజ్ఞచైతన్య వేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ సిబ్బంది భానుమతి, భాస్కరరావు, రమణమూర్తి, భూమిక, రోహిత్, లక్ష్మణ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.





## 122 మందికి వైద్య పరీక్షలు

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18(వార్త):** ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో గురువారం నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 122 మందికి పరీక్షలు నిర్వహించారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కళ్యాణ్‌బాబు పర్యవేక్షణలో వైద్యులు దేవేందర్ రెడ్డి, అనూష, గౌతమి, శిల్ప, నీలిమ, నిర్మల్, శ్రీకాంత్, రమేష్ వైద్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో నిర్మలా రెడ్డి, రాజు, నందికి, జానీ, కొండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18(వార్త):** కె.శాసనం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భినుల, బాలింతలకు గురువారం పోషకాహారాన్ని ఎంపీపీ బోర పుష్ప అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ త్రినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తి, శ్రద్ధలతో విశ్వకర్మకు పూజలు



**మందస, సెప్టెంబరు 18(వార్త):** కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముకుందపురంలో సంఘం అధ్యక్షుడు బూరగాపు దామోదర్‌ఆచారి, సభ్యుల ఆధ్వర్యంలో శ్రీవిశ్వకర్మ పూజ గురువారం ఘనంగా జరిగింది. ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయనను దామోదర్‌ఆచారి దుశ్శాలువతో సన్మానించారు. విశ్వబ్రాహ్మణ జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులు కు నేడు వైద్య శిబిరం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18(వార్త):** ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ బాలుర పాంశాలలో దివ్యాంగ విద్యార్థుల కోసం వైద్య శిబిరం శుక్రవారం నిర్వహిస్తామని సహిత ఉపాధ్యాయులు తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీకి అర్హులను గుర్తిస్తామన్నారు. ఆధార్, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోస్, యూడీఐడీ కార్డు జిరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు శిబిరానికి తప్పకుండా రావాలని దివ్యాంగ విద్యార్థులను వారు కోరారు.

## భవన నిర్మాణ కార్మికునికి ఆర్థిక సాయం

**మందస, సెప్టెంబరు 18(వార్త):** అంబుగాంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం స్నేహభావాన్ని చాటుకుంది. ఆ గ్రామానికి చెందిన గుజ్జుల లోకేష్ అనే కార్మికుడికి పక్షవాతం రావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. పేద కుటుంబం కావడంతో భవన నిర్మాణ కార్మికులు రూ.36,800లు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నవోదయ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్మికులు దేవాడ నారాయణరావు, బల్ల మాధవరావు, మామిడి గోపాలు, బల్ల దానయ్య, దేవాడ హేమరాజు, సింధిరి తాతారావు, మజ్జి శివకేశవరావు తదితరులు పాల్గొన్నారు.



# ఎరువుల కేంద్రాలను తనిఖీ చేసిన తహసీల్దార్

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18(వార్త):** ఇచ్ఛాపురంలోని యూరియా పంపిణీ కేంద్రాలను తహసీల్దార్ వెంకటరావు పరిశీలించారు యూరియా పంపిణీ విధానంపై రైతులని అడిగి తెలుసుకున్నారు. 250 టన్నుల యూరియా వచ్చిందని, రెండు రోజుల్లో మరో 250 టన్నుల యూరియా రాబోతుందని తెలిపారు. సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తు ఉంచాలని అధికారులను సూచించారు. అనంతరం ప్రైవేటు డీలర్లు వద్ద ఎరువుల పంపిణీ పరిశీలించారు. విష్ణు ఎంటర్‌ప్రైజెస్ వద్ద 25 టన్నుల యూరియా ఉన్నట్లు వ్యవసాయ అధికారి అజయ్‌కుమార్ చెప్పారు. రత్తకన్నలో ఎరువుల పంపిణీ జరుగుతున్నట్లు తెలిపారు.



# మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్త్ నారీ సశక్త్ పరివార్



**సరుబుజ్జిలి, సెప్టెంబరు 18(వార్త):** ఆసుపత్రిలో మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని డాక్టర్ సాహితీ ప్రియదర్శిని అన్నారు. సరుబుజ్జిలిలోని ఆస్పత్రిలో గురువారం జరిగిన సమావేశంలో ఆమె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. మహిళలకు వివిధ పరీక్షలను నిర్వహించి, తగిన వైద్య సేవలను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు యండ రామారావు, వైసీపీ నాయకులు హరి, ప్రకాష్, చామంతి, పాతిన రాము, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల గోవిందరావు పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలి

**కోటబొమ్మాళి, సెప్టెంబరు 18(వార్త):** ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గొండు నారాయణరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వాసుదేవరావు, మన్మథరావు, తవిటమ్మ, నీలకంఠేశ్వరరావు ఆదినారాయణ,రమణమ్మ పాల్గొన్నారు.



# 2 నుంచి ఇచ్ఛాపురంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18(వార్త):** "స్వచ్ఛత హీ సేవ" (స్వచ్ఛోత్సవం) కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో స్థానిక హొటల్ వ్యాపారస్థులతో సమావే శం నిర్వహించారు. అక్టోబర్ 2 నుంచి మున్సిపాలిటీ పరిధిలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, పర్యావరణ కార్యదర్శులు, హొటల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఉప్పాడ తులసయ్య రెడ్డి, అధ్యక్షుడు ముప్పన గవరయ్య, సెక్రటరీ గుడియా హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీముఖలింగం భూముల రీ సర్వేపై ఫిర్యాదు

**జలుమూరు, సెప్టెంబరు 18(వార్త):** శ్రీముఖలింగం రైతు భరోసా కేంద్రం శివన్నారాయణపురం తరలించడంపై ఆర్డీవో వెంకటేశ్వరరావుకు గురువారం గ్రామస్థులు, రాజశేఖర్ ఫిర్యా దు చేశారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. రూ.25 లక్షలు వెచ్చించి రైతు భరోసా కేంద్రం నిర్మించారని, ఇప్పుడు పక్క ఊరికి తరలించడం భావ్యం కాదని సూచించారు. శ్రీముఖలింగ దేవాలయ భూముల పునః సర్వే వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మిశ్రోకు పీఎం మోడీ విజన్ ఆఫ్ భారత్ అవార్డ్

**ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 18(వార్త):** లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్మన్, లయన్ డా.ఎం.కె. మిశ్రో విశిష్టమైన సామాజిక సేవలకు తగిన గుర్తింపు లభించింది. ఉత్తరప్రదేశ్‌కి చెందిన వర్తీ వెల్నెస్ ఫౌండేషన్ ట్రస్ట్ వారు పీఎం మోడీ విజన్ ఆఫ్ భారత్ అవార్డు -2025ను ఆయనకు అందజేశారు. డా.మిశ్రోకి ఈ అవార్డు రావడంపై ఎల్ఎన్ పేట గ్రామ ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, మండల ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, యువకులు, దివ్యాంగులు, విద్యార్థినీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



## కుప్పిలి ఉపాధ్యాయులపై చార్జెస్ ఎత్తివేయాలి

**- ఎస్టీయూ నాయకుల డిమాండ్**

**-డీఈఓకు వినతిపత్రం అందజేత**

**ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 18(వార్త):** కుప్పిలి పదో తరగతి పరీక్షల ఘటనలో ఏడుగురు ఉపాధ్యాయులపై చార్జెస్ ఎత్తివేయాలని గురువారం డీఈవోను కలిసి వినతపత్రం అందజేశామని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ, జిల్లా కార్యదర్శి కూన శ్రీనివాసరావు తెలిపారు. అంతర జిల్లా బదిలీల కోసం జిల్లాకు వచ్చిన దరఖాస్తు లెన్ని, ఖాళీలెన్ని తెలియజేయాలని కోరామన్నారు. గార క్లస్టర్ పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌ను సంబంధిత క్లస్టర్ పరిధిలో ఉపయోగించకుండా ఖాళీగా ఉంచుతున్నా రని, అవసరమైన పాఠశాలల్లో డెప్యూటేషన్ వేయాలని విన్నవించామన్నారు.






## వంశధార ఆయకట్టుకు నీరందించండి

**పాతపట్నం ఎమ్మెల్యే ఎంజీఆర్**

**పాతపట్నం, సెప్టెంబరు 18(వార్త):** వంశధార ప్రాజెక్టుకు ప్రభుత్వమే భద్రత కల్పించి ఆయకట్టు చివరి ఎకరా వరకు కూడా సాగునీరు అందిం చాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మొదటిరోజు అసెంబ్లీలో తన గళాన్ని వినిపించారు. గత ప్రభుత్వం వంశధార ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడంతో లెఫ్ట్,రైట్ మెయిన్ కెనాలలో పూడికతో నిండిపోయి రక్షణ గోడ శిథిలావస్థకు చేరడంతో సాగునీరు అందడం లేదన్నారు.



## మందసలో రాష్ట్రీయ పోషణ వేడుకలు

**మందస, సెప్టెంబరు 18(వార్త):** మందసలో రాష్ట్రీయ పోషణ వేడుకలు సీడీపీఓ పెద్దింటి అరుణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీడీపీఓ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రామలక్ష్మి, లక్ష్మి, జయలక్ష్మి, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మందస, సెప్టెంబరు 18(వార్త):** మందస మండలంలో ఈ నెల 20న కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ జి.యజ్ఞేశ్వరరావు చెప్పారు. 11కేవీ హరిపురం ఫీడర్(24గంటలు)కు సంబంధించి చెట్ల కొమ్మలు తొలగింపు ఉంటుందన్నారు. దీంతో హరిపురం టౌన్, బాలిగాం, వీరభద్ర, రంగ నాథపురం, బీఎంపురం రోడ్డు తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## లింగాలపాడులో మహిళలకు వైద్యశిబిరం



**జలుమూరు, సెప్టెంబరు 18(వార్త):** లింగాలపాడు సచివాలయ పరిధిలో గురువారం మహిళలకు ప్రత్యేకంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి సంధ్యారాణి మహిళలకు పలు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురం ఎంపీడీవోగా ప్రభాకర్



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18(వార్త):** ఇచ్ఛాపురం ఎంపీడీవోగా ఎ.ప్రభాకర్ రావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో సారవకోట డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన ఈయన పదోన్నతిపై ఇక్కడకు బదిలీ అయ్యారు. ఆయనకు పంచా యతీ కార్యదర్శులు స్వాగతం పలికారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పలాస, సెప్టెంబరు 18(వార్త):** విద్యుత్ నిర్వహణ పనులతో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తామని పలాస డివి జన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలి పారు. బొడ్డపాడు సబ్ స్టేషన్ పరిధిలోగల మాకన్నపల్లి, మామిడిపల్లి ఫీడర్ల మీద సప్లై నిలుపుదల చేస్తామన్నారు. మగ్రిపాడు, మామిడిపల్లి, మాకనపల్లి, నీలావతి, గురుదాసు పురము, కొబ్బరి చెట్లూరు, సుమ్మాదేవి, రంగోయి తదితర ఏరియాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగ దారులు గమనించి, సహకరించాలని కాశీబుగ్గ విద్యుత్ ఏఈ వివేకానంద కోరారు.

## పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయండి

**-కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును కోరిన మాజీమంత్రి గౌతు శివాజీ**



**పలాస, సెప్టెంబరు 18(వార్త):** కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు వేగంగా జరిగి సకాలంలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా నిర్మా ణాలు జరిపించాలని, వజ్రపత్తూరు నుండి అక్కుపల్లి మీదుగా మున్సిపా లిటీకి అనుసంధానం చేస్తూ నిర్మాణం జరిగిన రోడ్డు మధ్యలోనే ఆగిపోయి మధ్యలో ఉన్న గ్రామాల వద్ద గ్రావెల్ బయటపడి వాహన చోదకులు ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రాధాన్యత క్రమంలో రోడ్డును పూర్తి చేయాలని, అంతవరకు పూర్తిగా పాడైన ప్రదేశంలో రోడ్డు మరమ్మతులు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును గౌతు శివాజీ కోరారు. కేంద్ర మంత్రి విషయాలపై సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత గుత్తేదారులకు ఫోన్ చేసి పనులు వేగవంతం చేసి రిపేర్ అయిన రోడ్లను మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

## నౌపడలో విద్యార్థులకు 'బిగ్ హెల్ప్'



**సంతబొమ్మాళి, సెప్టెంబరు 18 (వార్త):** బిగ్ హెల్ప్ ఎడ్యుకేషన్ సంస్థ నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 15 మంది అనాథ, ప్రతిభా, నిరుపేద విద్యార్థులకు గురువారం సాయం అందించింది. వాటర్ బాటిల్, జామెట్రీ బాక్స్ రంగు పెన్సిల్లు స్కెచ్ పెన్స్, సాధారణ పెన్నులు, తెల్ల కాగితాలు సుమారు 350రూపాయలు విలువ చేసే సామగ్రిని ప్రధానోపాధ్యాయులు ఎం.భానుప్రకాష్, బిగ్ హెల్ప్ నౌపడ ప్రాజెక్టు డైరెక్టర్, జోనల్ డైరెక్టర్ యల్ జయకృష్ణారెడ్డి, చైర్మన్ సివి రాజా పంపిణీ చేశారు. ఈ ఏడాది నుంచి గోల్డెన్ స్టార్ విన్నర్ అవార్డుల కార్యక్రమం లో భాగంగా ఫార్మా టివ్ 1లో ప్రతిభ చూపిన విద్యార్థులు పబ్లిక్ పరీక్షలో మొదటి పది స్థానాలకు గాను ప్రతి తరగతికి పది మంది చొప్పున 50 మంది విద్యార్థులకు 6000 రూపాయలు విలువ గల బహుమతులతో పాటు, విన్నింగ్ బ్యాడ్జీలు అందించారు. బిగ్ హెల్ప్ ఎడ్యుకేషన్ ఫౌండర్ చైర్మన్ చాంద్ బాషాకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు బాధ్యత వహించాలి



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18(వార్త):** తల్లిదండ్రులు విద్యార్థులపై బాధ్యత వహించాలని విద్యా కమిటీ చైర్‌పర్సన్ ఆసి లతారెడ్డి కోరారు. 9వ తరగతి విద్యా ర్థుల తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశం సురంగి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగింది. సమావేశంలో సభ్యులు, ఉపాధ్యాయులు జయలక్ష్మి, సూర్యం, తిరుమల కో ఆప్షన్ సభ్యులు ఆశి గౌరీశంకర రెడ్డి పాల్గొన్నారు.

## అంబుగాంలో ఉచిత వైద్య శిబిరం




**మందస, సెప్టెంబరు 18(వార్త):** అంబుగాంలో స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది, అంబుగాం గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వాసు కుటుంబానికి నీలకంఠం పరామర్శ

**మందస, సెప్టెంబరు 18(వార్త):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మొగి లిపాడు గ్రామపెద్ద బొడ్డు వాసుదేవరావు మాతృమూర్తి బొడ్డు మహాలక్ష్మి హఠాత్తుగా మరణించారు. ఆ కుటుంబాన్ని అగ్నికుల క్షత్రియ జిల్లా నాయకుడు జుత్తు నీలకంఠం గురువారం పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# సుర్జినిలో గ్రానైట్ క్వారీ ఏర్పాటు చేయొద్దు

**-గ్రామస్తుల ఆందోళన**

**మెళియాపుట్టి, సెప్టెంబరు 18(వార్త):** సుర్జిని గ్రామంలో గ్రానైట్ క్వారీ ఏర్పాటు చేయొద్దని తహసీల్దార్‌కు ఆ గ్రామస్తులు గురువారం విన్నవించారు. గ్రానైట్ క్వారీ ఏర్పాటు చేస్తే, తమ పొలాలు నాశనమైపోతాయని, తాగునీరు కలుషితమై ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం క్వారీ స్థలం వద్ద నిరసన చేపట్టారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546